క్లుప్తంగా

నేడు హిందువుల హైందవ శంఖారావం ర్యాలీ

వేంపల్లె : పట్టణంలో శుక్రవారం హిందువుల హైందవ శంఖారావం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన విజయవాడ పట్టణంలో వేలాది హిందువుల సమక్షంలో జరిగే హైందవ శంకరావ కార్యక్రమానికి విజయవంతం చేయడానికి శ్రీ వాసవీ కల్యాణ మండపం నుంచి హైందవ గ్రామ ప్రదర్శన, 108 కలశాలతో, రామ పరిహార వేషధారణలతో, కోలాట నృత్యాలు చేసుకుంటూ రామ సంకీర్తనతో మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి గుడిమీదుగా ర్యాలీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో హిందువులందరూ హాజరై పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

సింహాద్రిపురం : మైనర్లకు తమ వాహనాలను ఇవ్వరాదని ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి బుడ్డయ్యపాలెం సెంటర్‌లో ఆయన వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి వాహనదారులు తప్పక లైసెన్స్ కలిగిఉండాలన్నారు. రికార్డులు, లైసెన్స్‌లు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సేవా సమితి భవన నిర్మాణానికి దాత విరాళం

పులివెందుల టౌన్ : పట్టణంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణం కొరకు గురువారం రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీపతి చిన్న బాలుడు కుమారుడు చక్రవర్తి రూ.10,116ల విరాళాన్ని శిల్పారామ ఏఓ సుధాకర్ చేతులమీదుగా సేవా సమితి అధ్యక్షుడు రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాలిట వరం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి

వేంపల్లె : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతుల పాలిట వరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే మొత్తం రూ.6వేల నుండి రూ.10వేలకు పెంచడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఎలాంటి అవినీతి జరగకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతోందన్నారు. కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని మరింతగా మెరుగుపరచాలని నిర్ణయించారన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలి

వల్లూరు (చెన్నూరు) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను ఈనెల 5, 6, 7, 8 తేదీలలో కాకినాడలో నిర్వహించనున్న తరుణంలో వాటిని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర మహాసభల ఆహ్వాన కరపత్రాలను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ బడుల బలోపేతం కోసం ఈ స్వర్ణోత్సవ మహాసభలలో పలుకీలక నిర్ణయాలు తీసుకుంటారన్నారు. జీవో 117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలను ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు కొనసాగించాలన్నారు. సీపీఎస్ జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ముద్దనూరు : పాఠశాల యాజమాన్య కమిటీతో కలిసి ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల విద్యాశాఖాధికారులు శివప్రసాద్, నాగేశ్వర రావు నాయక్‌లు తెలిపారు. గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల కమిటీతో పాటు తల్లితండ్రులను భాగస్వాములను చేయాలని, పాఠశాలల్లో మౌలికవసతులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు కార్యక్రమాలను పర్యవేక్షించాలని శిక్షణలో తెలియజేశారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

వేంపల్లె : అత్యుత్తమ సేవల ద్వారా ఉపాధ్యాయుల అభిమానాన్ని చూరగొంటున్న రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఏపీ ఎస్టీయూ) అని ఎంఈఓలు జాఫర్ సాధిక్, స్టాలిన్ ఐజాక్‌లు తెలిపారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం, ఎస్టీయూ కార్యాలయాల్లో ఎస్టీయూ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారెడ్డి, రాజశేఖర్, జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బజార్ వినియోగంలోకి ఎప్పుడో..?

- రూ 1.20 కోట్లతో ఆధునిక రైతు బజార్ ఏర్పాటు
- పిచ్చి మొక్కలు, చెత్త చెదారాలతో నిండిన రైతు బజార్


రైతు బజార్‌లో నిరుపయోగంగా ఉన్న షాపులు


వేంపల్లెలో రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు (ఫైల్)



వేంపల్లె పట్టణంలోని మోడల్ రైతు బజార్

వేంపల్లె : జిల్లాలో మేజర్ పంచాయతీ గ్రామమైన వేంపల్లె రైతు బజార్ లేకపోవడం శోచనీయం. మండలానికి చుట్టూ పక్కల గ్రామాల్లో ఉన్న రైతులు లబ్ధి పొందేందుకు వినియోగదారునికి తక్కువ ధరలకు అందజేసేందుకు రైతు బజార్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రారంభించారు. అయితే దాన్ని కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కూరగాయలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. శుక్రవారం సంత మార్కెట్ ఉన్నప్పటికీ నేరుగా రైతులు కాకపోవడంతో మధ్యవర్తులు, దళారులు అమ్మకాలు చేస్తుండటం కారణంవల్ల రోజువారి డైలీ మార్కెట్, హోల్ సేల్ మార్కెట్లకు మధ్య ధరల వ్యత్యాసం అంతగా ఉండటం లేదు. వేంపల్లె, చక్రాయపేట మండలాల్లోని ఉల్లి, మిర్చి, వంకాయ, తదితర కూరగాయలకు ప్రసిద్ధి అయినప్పటికీ ధరలు తగ్గకపోవడం శోచనీయం. అంతేకాకుండా ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు కూరగాయలతోపాటు ఇతర వస్తువులు రవాణా అవుతాయి. అటువంటి ఈ ప్రాంతంలో రైతు బజార్ ప్రారంభించినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మెయిన్ బజార్‌లో సంత మార్కెట్ :
గతంలో పాత మెయిన్ బజార్‌లో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపై ప్రతి శుక్రవారం సంత మార్కెట్ నిర్వహించేవారు. గతంలో కరోనా వైరస్ ఉన్నప్పుడు ఏ కారణంగానో తెలియదు కానీ క్రమేనా మూతపడింది. అప్పటినుంచి ప్రస్తుతం ఇప్పటివరకు కడప రోడ్డులో ఉన్న ఒక కల్యాణ మండపంలో బాడుగకు తీసుకుని సంత మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. రైతు బజార్ ప్రారంభించినా ఆ విషయాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు.

ఆధునిక వసతులతో కూడిన మోడల్ రైతు బజార్ :
వేంపల్లె పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి భవనం వెనుక ఖాళీ స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిల కృషితో రూ.1.20 కోట్లతో అత్యంత ఆధునిక వసతులతో కూడిన మోడల్ రైతు బజార్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం రైతు బజార్ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలు వెలిశాయి. ఆ ప్రాంతంలో ఆటోలు, టూవీలర్, ప్రైవేట్ వాహనాలు నిలిపేందుకు ప్రదేశంగా మారింది.

రైతు బజార్ ప్రశ్నార్థకం
మండలానికి ఒక రైతు బజార్ పథకంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు కేటాయించారు. తీర్మానాలు జరిగాయి. ఆ తర్వాత నిర్మాణాలు పూర్తయి గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. ప్రస్తుతం రైతు బజార్ వినియోగంలోకి తీసుకొస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

మధ్యవర్తుతోధరలు ఆకాశన్నంటుతున్నాయి
రైతులు కష్టపడి పండించిన కూరగాయలను దళారీ వ్యవస్థలేని మార్కెట్‌లో అమ్మేందుకు సాహసం చేయలేని పరిస్థితులలో ఆ రైతులు తమ సరుకును హోల్ సేల్ వర్తకులకు అమ్ముతున్నారు. మధ్యవర్తులు కారణంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వాస్తవానికి రైతు తాను పండించిన పంటను రైతు బజార్‌లో నేరుగా అమ్మితే గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రైతు బజారు అందుబాటులో లేకపోవడంతో అటు రైతులు, ఇటు ప్రజలు నష్టపోతున్నారు. ప్రభుత్వాలు చోద్యం చూడటం తప్ప సామాన్యుల గురించి ఆలోచన చేయడమే లేదు. రైతు బజార్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మార్కెట్ కమిటీ, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి ధరలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు బజార్ కలగానే మిగిలిపోయింది



మోడల్ రైతు బజార్ అన్నారు. కానీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అది కల లాగే మిగిలిపోయింది. గతంలో మెయిన్ బజార్‌లో సంత మార్కెట్ ఉండేది. ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు ఇతర వస్తువులు అందేవి. ప్రస్తుతం సంత మార్కెట్‌ను దూర ప్రాంతానికి తీసుకెళ్లడంతో సర్కిళ్ల వద్ద అధిక ధరలతో కొనుగోలు శక్తి నశించింది. రైతు బజార్ విషయంపై ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. కానీ సమస్య పరిష్కారం కాలేదు. – గాలి హరిప్రసాద్, వార్డు మెంబర్, వేంపల్లె

ధరలు ఆకాశాన్నంటుతున్నాయి



కూరగాయలు, ఇతర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు కూరగాయలతోపాటు, ఉల్లిపాయలు, కంది బేడలు తదితర వస్తువులు కొనుగోలు చేయాలంటే వచ్చే ఆదాయం సరిపోవడంలేదు. పట్టణంలో రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలి. రైతులకు, ప్రజలకు లాభసాటిగా ఉండే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.
– ఎం.రమేష్‌బాబు, స్థానికుడు, వేంపల్లె

రైతులకు పెట్టుబడి సహాయం ఎక్కడ?

వేంపల్లె : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సహాయంగా రూ.20 వేలు అందిస్తామని రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పథకాన్ని అమలు చేయలేదని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలం నెట్టుకొస్తుందన్నారు. అటు విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించకుండా కేవలం ఆర్భాటాలకే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో ఊసేత్తడంలేదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని పెట్టుబడి సహాయం ఎప్పుడిస్తారో ప్రకటించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గేట్, సివిల్స్ ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించండి

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో గేట్, సివిల్స్ ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించాలని ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పుల్లగూర శోభన్ బాబు కోరారు. గురువారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గేట్, సివిల్స్, స్కిల్ డెవలప్‌మెంట్, బ్యాంకింగ్ కోర్సులకు లాంగ్ టర్మ్ ఫౌండేషన్ తరగతులు నిర్వహించాలని, అలాగే విద్యార్థులకు మౌలిక వసతులు, రుచి సుచి కలిగిన భోజనం, వసతి గృహాల్లో పరిశుభ్రతకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మంచి వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఉత్తమ బోధనతోపాటు ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్, తదితర ఒకేషనల్ కోర్సులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవి కుమార్, డీన్ అకాడమిక్ రమేష్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రత్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో విజయారెడ్డి

వల్లూరు : పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర కీలకమైనదని మండల విద్యా శాఖాధికారి విజయారెడ్డి తెలిపారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా యాజమాన్య కమిటీలు తమ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు పాఠశాల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..
ఎర్రగుంట్ల : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ సభ్యులు తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ సంయుక్తంగా తోడ్పాటు అందించాలని మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు తెలిపారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులు వారానికి ఒక్కసారి పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల పనితీరును, విద్యార్థుల హాజరును, మధ్యాహ్నం భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వాటిని పర్యవేక్షించాలన్నారు. పాఠశాలకు కెటాయించిన నిధులు సక్రమంగా పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయా లేదా అని పరిశీలించాలన్నారు.

చౌకదుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఖాళీగా ఉన్న 25 ప్రభుత్వ చౌక దుకాణాలకు డీలర్ల నియామకంపై నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దార్ శోభన్‌బాబు గురువారం తెలిపారు. దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 8వ తేదీ చివరి తేదీ అన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 17వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు.
రిజర్వేషన్‌ల ప్రకారం తీసుకుంటే పట్టణంలో 1వ వార్డు (ఓసీ మహిళ), 1, 2 వార్డులు (బీసీ–ఈ), 3వవార్డు (బీసీ–ఎ), 4వ వార్డు(ఎస్సీమహిళ), 4,5 వార్డులు (ఓసీ, మహిళ), 7వ వార్డు (ఎస్సీ), వై.కోడూరు(ఓసీ మహిళ), వై.కోడూరు (ఓసీ, పిడబ్ల్యూబీడీ), పెద్దనపాడు(ఈడబ్ల్యూఎస్), తుమ్మలపల్లి (ఎస్టీ), వలసపల్లి(ఓసీ మహిళ), నిడుజివ్వి (బీసీ–బి), చిలంకూరు (ఓసీ, ఎక్స్‌సర్వీస్), సున్నపురాళ్లపల్లి (ఓసీ), సున్నపురాళ్లపల్లి (ఎస్సీ), ఇల్లూరు (బీసీ–ఈ), పోట్లదుర్తి (ఎస్సీ, మహిళ), పి.వెంకటాపురం (ఓసీ, క్రీడాకారుడు), ఎర్రగుంట్ల (ఓసీ),

కొత్త దుకాణాలు
చిలంకూరు–1 (బీసీ–ఎ), చిలంకూరు–1 (ఓసీ మహిళ), పోట్లదుర్తి (ఓసీ, పిడబ్ల్యూబీడీ), పోట్లదుర్తి(ఓసీల), వినాయకనగర్ (ఎస్టీ, మహిళ), కలమల్ల–1 (ఓసీ, మహిళ) షాపులు ఖాలీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్, పది ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. వయస్సు 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కొండాపురం ..
కొండాపురం : మండలంలోని 36 రేషన్ దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని మండల తహసీల్దార్ గుర్రప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆసక్తి, అర్హత కలిగిన వారు కేటాయించిన రిజర్వేషన్ మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ దుకాణం కొరకు అర్హత ఇంటర్ పాసై వుండాలన్నారు. రిజర్వేషన్ల వివరాల కొరకు తమ విఆర్వోలను సంప్రదించాలన్నారు.

పాపాసాహెబుపేటలో రెవెన్యూ సదస్సు

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేట గ్రామ సచివాలయంలో గురువారం భూమి సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆర్ఓఆర్, సర్వే కొలతల విస్తీర్ణం సమస్యల పైన 24 అర్జీలు రైతులను నుండి వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సదస్సులో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.
శుక్రవారం బుగ్గలేటిపల్లి గ్రామానికి సంబంధించిన భూమి సమస్యలపై బుగ్గలేటిపల్లె మండల ప్రజాపరిషత్ స్కూల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

రిమ్స్ మార్చురీలో వృద్ధుడి మృతదేహం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో డిసెంబర్ 21న బృందా వృద్ధాశ్రమం నుంచి రామచంద్రుడు (90) అనే వృద్ధుడు అనారోగ్యంతో చేరారు. ఆయన చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఉంటే తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

ఘనంగా లక్షార్చన పూజ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటరమణుడిస్వామి ఆలయంలో గురువారం శ్రీవెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆలయ మూల విరాట్‌కు లక్షార్చన పూజ నిర్వహించారు. ఈ పూజలో 80 మందికిపైగా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి ప్రతిమ పాదుకలను తాకించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందించారు.

హామీలను అమలుపరచాలి


సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని పట్టణంలోని 19, 20 వార్డ్ సచివాలయ వలంటీర్లు గురువారం అడ్మిన్‌కు వినతిపత్రం అందించారు. చంద్రబాబు ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతున్నా అమలు చేయలేదన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

వల్లూరు (చెన్నూరు) : ముండ్లపల్లెలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల ఎమ్మార్వో సరస్వతి పాల్గొని భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాలలోకి వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులు తమ సమస్యలను అర్జీల ద్వారా రెవెన్యూ సదస్సులో అధికారులకు ఇవ్వాలన్నారు. ఇచ్చిన అర్జీలను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, డీటీ వెంకటరమణ, సర్వేయర్ సోమశేఖర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమానికి తరలిరండి

కమలాపురం : పేద ప్రజల ఇళ్ల స్థలాలపై ఈనెల 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలకు తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేద ప్రజలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, అలాగే అర్హులైన పేద ప్రజలకు రెండెకరాల చొప్పున భూమిని పంపిణీ చేయాలని సీపీఐ చేస్తున్న రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా ఈనెల 10న తేదీన అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. దీంతో అర్హులైన పేద ప్రజలందరూ పార్టీలతో సంబంధం లేకుండా వ్యక్తిగత అర్జీలతో రావాలని ఆయన పిలుపునిచ్చారు.

పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ

లింగాల : పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండలస్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో పరిశీలకులు రామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కోసం యాజమాన్య కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఎమ్మార్పీలు, పాఠశాలల కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపండి

వల్లూరు : ఎస్సీ వర్గీకరణ విషయమై ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్‌ను నియమించిందని, ఈ కమిషన్ శుక్రవారం ఉదయం కడపలోని కలెక్టరేట్ చేరుకోనుందని ఏఎస్‌డబ్ల్యూఓ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లోని సభా భవనంలో సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశానికి ఎస్సీ ఉపకులాల సభ్యులు, ఎస్సీ సంఘాలు హాజరై తమ అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో అందించవచ్చని తెలిపారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


చదిపిరాళ్ల వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో వారు క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నారుమడిలో ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు అధికంగా ఆశించిందని గుర్తించారు. గొంగళిపురుగు దారం లాంటి పదార్థంతో 3–4 ఆకులను నిటారుగా ముడత చేసుకుని లోపలి భాగాన పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకుల మీద తెల్లని చారలు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలగ జేస్తుందన్నారు. పిలకల పెరుగుదలలో ఎదుగుదల ఉండదన్నారు. ముడత చేసుకున్న ఆకులను తెరచి చూస్తే గొంగళి పురుగు విసర్జించే పదార్థం కనిపిస్తుందన్నారు. ఆకుముడత గమనించినప్పుడు తాడును ఇద్దరు వ్యక్తులు అటు ఇటుగా 2–3 సార్లు లాగడం వలన ఆకుముడతలోని గొంగళి పురుగులు నీళ్లలో పడిపోయి చనిపోతాయన్నారు. పిలక దశలో ఆకుముడత గమనించినట్లయితే ఒక ఏకరానికి క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా క్లోరాంత్ర నిలిప్రోల్ 60మి.లీ. మందును పిచికారి చేయాలన్నారు. కాండం తొలిచె పురుగు గుడ్లను ఆకుల చివర కొన భాగానికి దగ్గరగా పెడతాయని, ఆకుల కొనలను కత్తిరించి నాటుకోవాలన్నారు. గుడ్ల నుంచి వచ్చిన లద్దె పురుగు కాండం కనుతుల దగ్గర రంధ్రం చేసుకుని లోపలికి చేరుకుంటుందన్నారు. కాండం తొలిచే పురుగు పిలకలు పెట్టే దశలో పంటను ఆశిస్తే మొవ్వు చనిపోతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్షం నీటిని తొలగించారు

కమలాపురం : మండలంలోని చిన్నచెప్పలి ఓ వీధిలో వర్షం నీరు వారాల తరబడి నిలిచి స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఘటనను గత ఏడాది నవంబర్ 25వ తేదీన సాక్షి దినపత్రికలో ‘వర్షం నీటిని తరలించండి సారూ...’ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఈఓపీఆర్‌డీ కేజీఎం స్పందించారు. అదే రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే వర్షాలు పడుతూనే ఉండటంతో ఎలాంటి చర్యలు చేపట్టలేక పోయారు. వర్షాలు పూర్తిగా తగ్గిపోవడంతో రెండు రోజుల క్రితం అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నివాసితులతో చర్చించి వీధిలో నిలిచిన వర్షం నీటిని తరలించారు. అలాగే వీధి పొడవునా గ్రావెల్ మట్టి వేసి రోడ్డు ఎత్తు పెంచారు. స్థానికులు అధికారులతో పాటు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సాక్షి ఎఫెక్ట్..


వర్షం నీరు నిలిచిన చిన్నచెప్పలి వీధి(నాడు)


గ్రావెల్ మట్టి వేయడంతో శుభ్రంగా ఉన్న రోడ్డు (నేడు)

ఇబ్రహీంకు ప్రపంచ మహాసభల నుంచి ఆహ్వానం


షేక్ ఇబ్రహీం

వేంపల్లె : హైదరాబాద్‌లో నిర్వహించే 12వ ద్వైవార్షిక అంతర్జాతీయ తెలుగు మహాసభలకు వేంపల్లె వాసి బజాజ్ షోరూం అధినేత డాక్టర్ షేక్ ఇబ్రహీంకు ఆహ్వానం రావడం జరిగింది. ఈ ప్రపంచ మహాసభలకు హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్టణం, సింగపూర్, మలేసియా, దుబాయి తదితర ప్రాంతాల నుంచి ఎంతో మంది కవులు, రచయితలు, విమర్శకులు, సాహితీపరులు పాల్గొంటున్నారు. ఈ మహాసభలు ప్రతి ఐదేళ్లకొకసారి తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. డాక్టర్ షేక్ ఇబ్రహీం రాసిన బతుకు ప్రయాణం, బంధీకా జిందగీ, నేను మనిషిని, ఓ రైతన్న, ఘోర పాపమే, ఆమె మనిషే మొదలగు కవితలు పేరు ప్రఖ్యాతలు సంపాదించి విశిష్టతను పొందాయి. ఈయన రాసినా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయపరంగా ప్రచురించబడ్డాయి.

6న జరిగే నిరాహార దీక్షకు తరలి రావాలి


నిరాహార దీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

వేంపల్లె : ఈనెల 6వ తేదీన కడప కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరాహార దీక్షకు భవన నిర్మాణ కార్మికులందరూ తరలి రావాలని ఆ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిరాహార దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో భవననిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంభిస్తామని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, మండల అధ్యక్షుడు దస్తగిరి, సభ్యులు పాల్గొన్నారు.